నమస్తే తెలంగాణ
# జిందగీ
I హైదరాబాద్
శనివారం | 22 | అక్టోబర్ 2016

## చిత్రసీమలో పోరాటం..

**సినీ రంగంలో** ఉండే పురుషాధిక్యతపై.. తమిళనాడుకు చెందిన దర్శకురాలు వైష్ణవి సుందర్ సరికొత్త పోరాటానికి తెరలేపారు. ఉమెన్ మేకింగ్ ఫిల్మ్స్ పేరుతో ఒక కమ్యూనిటీని ప్రారంభించారు. చెన్నై దగ్గరలోని అవడి అనే చిన్న పట్టణంలో వైష్ణవి జన్మించారు. చిన్నప్పటి నుంచి తాను ఏం చదవాలో.. ఎలాంటి బట్టలు వేసుకోవాలో.. చివరికి ఏం చేయాలనేది కూడా కుటుంబంలోని మగవారే (తండ్రి, సోదరులు) నిర్ణయించేవారనీ, దీంతో పురుషాధిక్య సమాజంపై కోపంగా ఉండేదానినని చెబుతున్నారు. దేశంలోని అనేక మంది బాలికలు కూడా ఇదే విధంగా పెరుగుతున్నారనీ, 'నియమ



నిబంధన'ల పేరుతో అణచివేతకు గురవుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాంటి నియమాలతో విసుగు చెందిన వైష్ణవి, ఎలాగైనా సమాజంలో మార్పు తీసుకురావాలని అనుకునేవారు. చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 'థియేటర్ నిషా'లో చేరి నాటకాలు, సినిమాలపై తనకున్న అభిరుచికి మరిన్ని మెరుగులు దిద్దుకున్నారు. నటిగా సినీ జీవితాన్ని ప్రారంభించి రచయిత్రిగా, దర్శకురాలిగా ఎదిగారు. చిత్రరంగంలో రాణించాలనుకునే మహిళల కోసం ఉమెన్ మేకింగ్ ఫిల్మ్స్ పేరుతో కమ్యూనిటీని ఏర్పాటు చేశారు. ఇందులో 85 మందిని సభ్యులుగా చేర్చుకుని, బలమైన కమ్యూనిటీగా ఎదిగారు. సినిమాలు నిర్మించాలనుకునేవారికీ, నటులుగా, దర్శకురాలిగా ఎదగాలనుకునేవారిని ప్రోత్సహిస్తున్నారు. తాను చిత్రసీమలోకి అడుగుపెట్టిన మొదట్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాననీ, స్వలింగ సంపర్కులపై సినిమా నిర్మిస్తానని చెప్పగానే అనేక విమర్శలు వెల్లువెత్తాయనీ చెప్పారు. అయినా తన ప్రయత్నాన్ని విరమించలేదన్నారు. సొంత నిర్మాణ సంస్థను ఏర్పాటుచేసి, చిత్రాన్ని నిర్మించినట్లు తెలిపారు. తమిళంతోపాటు తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అనేక లఘు చిత్రాలను నిర్మించారు. పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులనూ అందుకున్నారు. తనలా మరెవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఉమెన్ మేకింగ్ ఫిల్మ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కమ్యూనిటీ ద్వారా సినీరంగంలో మహిళలపై ఆధిపత్యానికి చెక్ పెట్టాలనుకుంటున్నట్లు చెబుతున్నారు.

## వంట చిట్కాలు



- గోధుమలను పిండి పట్టించేముందు శుభ్రంగా కడిగి, ఎండబోసి పట్టించాలి. దీంతో పిండి మెత్తగా వస్తుంది.
- గోధుమ పిండిలో గోరువెచ్చని నీరు లేదా కొన్ని పాలు లేదా కాస్త నూనె కలిపి గంటపాటు నానబెట్టాలి.
- బాగా ఉడికిన బంగాళాదుంపలను చపాతి పిండిలో కలపాలి.
- చపాతీలు ఒత్తేటప్పుడు మధ్యలో కొంచెం నూనె వేసి, మడతలతో చేయాలి. తర్వాత హాట్ ప్యాక్‌లో ఉంచితే చాలా సమయం పాటు మెత్తగా ఉంటాయి.

## 28 దేశాలు.. 31,000 కిలోమీటర్లు..



**యాత్రలు** అందరూ చేస్తారు. కొందరు మాత్రమే సాహస యాత్రలు చేసేందుకు పూనుకుంటారు. అందులో మరికొందరు మాత్రమే కొత్తకొత్త రికార్డులు సృష్టిస్తుంటారు. భారత సంతతికి చెందిన బ్రిటీష్ మహిళ బారులత కాంబ్లే, ఆర్కిటిక్ సర్కిల్ సాహయాత్రను ఒంటరిగా పూర్తి చేసిన మొదటి మహిళగా రికార్డుల్లోకెక్కారు. ఉత్తర సర్కిల్‌లో 400 కిలోమీటర్ల వరకూ తన భర్తతో కలిసి పూర్తిచేసి, విక్టర్ బ్రూస్ నెలకొల్పిన రికార్డును బద్దలు కొట్టారు. మిగిలిన 700 కిలోమీటర్లను ఎలాంటి మద్దతు, సపోర్ట్ వాహనం లేకుండానే ఒంటరిగా పూర్తి చేశారు. 42 ఏళ్ల వయస్సులో ఇంగ్లాండ్ నుంచి భారత్‌కు వాహనాన్ని డ్రైవింగ్ చేస్తూ వచ్చారు. 28 దేశాల మీదుగా 31,000 కిలోమీటర్లు ప్రయాణించి సరికొత్త రికార్డు సృష్టించారు. భారత ప్రభుత్వం ప్రారంభించిన 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకే ఈ యాత్ర చేపట్టినట్లు ఆమె చెప్పారు. వాహనానికి ఒక వైపున భారత జాతీయ పతాకం, మరోవైపున ఇంగ్లాండ్ పతాకంతో గత ఆగస్టులో బ్రిటన్‌లోని ల్యూటన్ పట్టణం నుంచి ఈ యాత్రను ప్రారంభించారు. 9 దేశాల మీదుగా 5,700 కిలోమీటర్లు ప్రయాణించి, సెప్టెంబర్ 23న ఫిన్లాండ్‌లోని రోవానియేమి గ్రామానికి చేరుకున్నారు. ఇది ఆర్కిటిక్ సర్కిల్‌లోని శాంటాక్లాజ్ గ్రామంగా చెబుతుంటారు. అక్కడి నుంచి మరో 2,792 కిలోమీటర్లు డ్రైవ్ చేసి నోర్డ్‌క్యాప్ చేరుకున్నారు. ఇది ఆర్కిటిక్ సర్కిల్‌లో ఉత్తరాన ఉన్న చివరి స్థానం. సముద్ర మట్టానికి 1,007 మీటర్ల ఎత్తులో ఉండే నోర్డ్‌క్యాప్‌పై ఇంగ్లాండ్‌తోపాటు భారతీయ జెండాను కూడా రెపరెపలాడించారు. భారత జాతీయ గీతాన్ని ఆలపించారు. నాలుగు రోజుల్లో ఈ దూరాన్ని పూర్తి చేసి కొత్త రికార్డు నెలకొల్పేలా, ప్రతిరోజూ 700 కిలోమీటర్లు ప్రయాణం చేశారు. తర్వాత రష్యా, చైనా మీదుగా భారత్‌కు చేరుకున్నారు.

'నీకు ఒక సంవత్సరానికి సరిపడా ఆహారం కావాలంటే ఒక పంట పండించు. పది సంవత్సరాలకు సరిపడా తిండి కావాలంటే ఒక చెట్టు పెంచు. వంద సంవత్సరాలకు సరిపడా భవిష్యత్తు కావాలంటే సమాజానికి మంచి మనిషిని అందించు' మనసు పెట్టి చదివితే ఈ మాటల్లో ఎంతో అర్థం ఉంది. సమాజాన్ని ముందుకు తీసుకుపోవాలన్నా, మంచి సమాజాన్ని నిర్మించాలన్నా అది కేవలం మనుషులతోనే సాధ్యం. అందుకే మంచి మనుషులు సమాజంలో ఉంటే వందేళ్లకు సరిపడా భవిష్యత్తును మూటగట్టుకున్నట్టే. ఇదే కాన్సెప్ట్‌తో పుట్టి, పనిచేస్తున్నది ఆలంబన స్వచ్ఛందసంస్థ.



# దారిచూపుతున్న ఆలంబన!

**పం**డుగ అంటే అదో సందడి. ఎల్లలెరుగని సంబురం. అందులోనూ దివ్వెల పండుగ అంటే పిల్లలకు, పెద్దలకు ఆ సంబురం, ఉత్సాహం రెట్టింపవుతుంది. టపాసుల హడావిడి, దీపాల కాంతులతో వీధులన్నీ కళకళలాడుతాయి. ఆలంబన నీడన చదువుకునే పిల్లలు స్వయంగా తయారుచేసిన దీపాంతలు, పిండి వంటలు, జ్యూట్‌బ్యాగులు, గవ్వలు, తోరణాలు వంటి వస్తువులెన్నో ఈరోజు ప్రదర్శనకు పెట్టబోతున్నారు. పిల్లల్లోని సృజనాత్మక శక్తిని ప్రోత్సహిస్తూ ఆలంబన పదిహేను సంవత్సరాలుగా ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నది. పండుగ పేరుతో మన సంతోషం కోసం ఇతర జీవులకు, పర్యావరణానికి హాని కలిగించొద్దు. దీపావళి పండుగ నాడు ప్రకృతికి చెడు చేసే పనులకు బదులు తోటివారికి మంచి చేసే పనులు చేస్తూ జరుపుకుందాం అంటూ సందేశమివ్వబోతున్నారు ఆలంబన పిల్లలు.

**ఈ** మాట ఎన్నోసార్లు రుజువయింది. ఆడపిల్లలను చదివించడం కాదు కదా.. గడప కూడా దాటనిచ్చేవారు కాదు ఆరోజుల్లో. కానీ ఇప్పుడు మహిళలు ప్రపంచాన్ని ఏలుతున్నారు. పతకాలు సాధిస్తున్నారు.

అపార్ట్‌మెంట్‌లో పెరిగే పిల్లలే కావొచ్చు.. ఏసీ బంగళాల్లో ఉండే పిల్లలే కావొచ్చు.. మురికివాడలో తిరిగే పిల్లలే కావొచ్చు. ప్రతి ఒక్కరిలో టాలెంట్ ఉంటుంది. కొంతమందికి తమ టాలెంట్‌ని బయట పెట్టుకునే అవకాశం వస్తుంది. కొంతమందికి రాదు. కానీ ప్రత్యేకంగా మురికివాడల్లో తిరిగే, పెరిగే పిల్లలకు అలాంటి అవకాశాలు రావడం అరుదనే చెప్పాలి.



దారి తెలియని గమ్యంలో, దిక్కుతోచని పయనంలో ఒక ధైర్యం కావాలి.. ఏం చేయాలో పాలుపోని సందిగ్ధ సమయంలో ఒక తోడు కావాలి.. బంగారు భవిష్యత్తుకు తీసుకునే నిర్ణయంలో పటిష్టమైన ఆలోచన కావాలి.. ఎవరికి వారై బతుకుతున్న ఈ సువిశాల ప్రపంచంలో సొంతంగా ఎదగగలమన్న ఆత్మవిశ్వాసం కావాలి.. ఇందుకోసం ఒక చేయూత కావాలి. ఒక ఆలంబన కావాలి. చదువుకు దూరంగా, పేదరికానికి, అమయాకత్వానికి దగ్గరగా ఉండే ఎంతోమంది పిల్లలకు ధైర్యానిస్తూ, వారి భవిష్యత్తును తీర్చి దిద్దే ఆలోచనా విధానంతో వారికి అండగా నిలబడుతున్న 'ఆలంబన' స్వచ్ఛంద సంస్థ ఈ దీపావళి సందర్భంగా సమాజానికి సందేశమిస్తూనే.. పిల్లలకు బతుకు మీద భరోసానిస్తున్నది.

కానీ వారిలో ఉండే టాలెంట్‌ని గుర్తించేందుకు ఒక వేదిక కావాలి. అలాంటి వేదికే 'ఆలంబన' స్వచ్ఛంద సంస్థ. ఇలాంటి పిల్లలకు సాయం చేయాలని, అవకాశాలు కల్పించాలన్న ఆలోచన ఎంతోమందికి ఉంది. కానీ వారికి ఓ వేదిక కావాలి. ఇప్పుడు ఆలంబన అలాంటి వారికి ఒక వేదికైంది. సంవత్సరానికి కనీసం వందమందినైనా చదివించడమే లక్ష్యంగా పనిచేస్తున్నదీ ఆలంబన.

### ఒక ఆలోచన.. ఎంతో మార్పు..!

పదిహేనేళ్ల క్రితం కూకట్‌పల్లి బాలాజీనగర్ కాలనీలో ఎక్కువ శాతం గుడిసెలు, డేరాలు వేసుకుని ఉండేవారు. అదే ప్రాంతంలో బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేసే దాసరి శిరీష కూడా నివాసముండేవారు. ఆ మురికివాడకు చెందిన పిల్లలు శిరీష ఇంటి ముందు ఆడుకుంటూ ఉండేవారు. స్కూల్‌కి వెళ్లేవారు కాదు. కనీసం తల నున్నగా దువ్వుకోవడం, స్నానం చేయడం, పద్ధతిగా మాట్లాడడం వంటివి కూడా తెలిసేవి కావు. వారిని చూసినప్పుడు శిరీష వారికోసం ఏదైనా చేయాలనుకున్నారు. కానీ ఉద్యోగరీత్యా వారి గురించి ఆలోచించే సమయం ఉండేది కాదు. చిత్తూరు జిల్లాలోని పుత్తూరులో ఆమె ఉద్యోగం చేసేది. అక్కడి నుంచి హైదరాబాద్ వచ్చే సమయంలో రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ఆమె కంటపడిన సంఘటన ఆమెను కలచివేసింది. ఆ మరునాడు తన సహోద్యోగులు, మిత్రులతో ఆ ఘటన గురించి తెలిపింది. వారితో కలిసి ఆ చుట్టుపక్కల ఉండే ఎస్సీ, బీసీ, ఎస్టీ హాస్టల్స్‌కి వెళ్లేవారు. రోజుకు రెండు గంటలు వారితో గడిపేది. ఎన్నో విషయాలు పంచుకునేది. వారి తల్లిదండ్రులు, కుటుంబ పరిస్థితుల గురించి తెలుసుకునేది. వారికి ఏదైనా చేయాలనుకుంది. కొన్ని రోజుల తర్వాత ఉద్యోగానికి స్వచ్ఛందంగా విరమణ తీసుకుని ఆలంబనకు శ్రీకారం చుట్టింది. తనుండే ఏరియాలో ఇంటింటికీ వెళ్లి పిల్లల తల్లిదండ్రులకు పిల్లల్ని చదివించమని అవగాహన కల్పించేది. అలా 15 మందితో ఆలంబన మొదలు పెట్టింది. సంగీత ప్రదర్శనలు, వస్తు ప్రదర్శనలు వంటి కార్యక్రమాలు నిర్వహించేవారు. అలా వచ్చిన ఆదాయం ఆలంబన నిర్వహణకు వాడేవారు. అలా చిన్న ఆలోచనతో మొదలైన ఆలంబన పదిహేను సంవత్సరాలుగా ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపింది.

### స్వయంగా ఎదిగేలా...

పిల్లల్లోని సృజనాత్మక శక్తిని బయటకు తీస్తూ రకరకాల వస్తువులు తయారు చేయిస్తూ, ఆ వస్తువులను ప్రతీ ఏడాది ప్రదర్శనకు పెడుతున్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల పిల్లలకు టీమ్‌వర్క్, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయి. అకౌంట్స్ మెయింటెన్ చేయడం, వస్తువులు అమ్మడం, స్టాల్ నిర్వహణ వంటి విషయాలు పిల్లలకు చిన్న వయసులోనే అనుభవంలోకి రావడం వల్ల భవిష్యత్తులో అవి ఎంతో ఉపయోగపడతాయి. ఆలంబనలో చేరి చదువుకున్న పిల్లలు ఇప్పుడు ప్రతీ ఏటా ఆలంబన నిర్వహించే ప్రదర్శనలకు స్పాన్సర్స్‌గా ఉంటున్నారు. చదువుకుంటున్న పిల్లలకు కావల్సిన వస్తువులు సమకూరుస్తున్నారు. వారికి కావల్సిన ఫీజులు కడుతున్నారు. ఐటీ రంగంలో పనిచేసే యువత కూడా ఆలంబనకు చేయూతనిస్తున్నారు. పిల్లలకు కావల్సిన వస్తువులు, ఆహార పదార్థాలు స్పాన్సర్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆలంబనలో అనాథ పిల్లలెవ్వరూ లేరు. అందరూ కూలీపని చేసుకునే వారి పిల్లలు, పేదరికం వల్ల చదువుకు దూరమైన పిల్లలే!

... ప్రవీణ్‌కుమార్ సుంకరి
వీరగొని రజినీకాంత్ గౌడ్

### ఒక ప్రపంచం కావాలి..



మురికివాడల్లో పిల్లల్లో ఉండే టాలెంట్, సృజనాత్మకత కార్పొరేట్ స్కూల్ పిల్లలకు ఏమాత్రం తీసిపోదు. వారికి అవకాశాలిస్తే వారి చేతులు కూడా అద్భుతాలు చేయగలవు. అలాంటి వారికి ఆలంబనగా ఉండాలన్నదే మా సంస్థ కాన్సెప్ట్. ప్రస్తుతం చదువుకు దూరంగా ఉన్న పిల్లలకు ఉచితంగా చదువు చెప్పిస్తున్నాం.

**– దాసరి శిరీషా**, ఆలంబన ఫౌండర్

### ఆలంబనే చదివించింది..



నాన్న లాండ్రీ పని చేస్తాడు. నన్ను చదివించే ఆర్థిక స్తోమత నాన్నకు ఉండేది కాదు. అప్పుడే ఆలంబన నాకు చదువు చెప్పించింది. ప్రస్తుతం టీకేఆర్ కాలేజీలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నా. ఆలంబన నిర్వహించే కార్యక్రమాల్లో నా వంతుగా పాల్గొంటున్నా.

**– నాగలక్ష్మి**, విద్యార్థిని

### పిల్లలే చేస్తున్నారు..



ప్రదర్శనల్లో ఉంచే వస్తువులన్నీ పిల్లలే స్వయంగా తయారుచేసినవి. అవి అమ్మితే వచ్చిన ఆదాయం ఆలంబన నిర్వహణకు సరిపోతున్నది. చిన్న వయసులోనే కొనుగోళ్లు, అమ్మకాలు, వస్తు ఉత్పత్తి అనే అంశాల మీద అవగాహన కల్పించడం వల్ల పిల్లలకు అవి భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడతాయి.

**– తోట అపర్ణ**, ప్రదర్శన నిర్వాహకురాలు

## కంటి చూపు మెరుగవ్వాలంటే...



**ఈ రోజుల్లో చిన్న పిల్లల్లోనే కాదు. పెద్ద వారిలో కూడా ఐసైట్ పెరుగుతున్నది. మొబైల్, కంప్యూటర్లను లేట్ నైట్ వరకు ఎక్కువగా వాడడం వల్ల ఆలస్యంగా అయినా సరే కంటి చూపు మందగిసున్నది. కంటి సమస్యలను దూరం చేసుకోవడానికి కొన్ని ప్రత్యేకమైన ఆహారాలు అందుబాటులో ఉన్నాయి.**

- కివీ ఫ్రూట్స్‌లో విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది. ఇది ఇమ్యూనిటి లెవల్స్‌ను పెంచుతుంది. అలాగే స్ట్రెస్‌తో పోరాడుతుంది. ఐస్ట్రెయిన్ తగ్గిస్తుంది.
- ఆరెంజెస్‌లో కూడా విటమిన్ సి ఎక్కువ. రెగ్యులర్‌గా ఆరెంజెస్ తినడం వల్ల కంటి సమస్యలు దూరం అవుతాయి. మంచి కంటి చూపు సొంతం అవుతుంది.
- క్యారెట్స్‌లో విటమిన్ ఏ, కెరోటినాయిడ్ కంటెంట్ అధికంగా ఉంటుంది. హెల్తీ ఐసైట్‌కి ఇది బెస్ట్ జ్యూస్.
- పురాతన కాలం నుండి వాడుకలో, ఆయుర్వేదంలో ఉండే ఔషధ దినుసు పసుపు. ఇందులో విటమిన్ ఎ, బి, ఇ పుష్కలంగా ఉన్నాయి. ఇంకా యాంటీ ఆక్సిడెంట్స్ అధికంగా ఉన్నాయి. కాటరాక్ట్‌ను నివారిస్తుంది.
- టమోటోల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. కంటి చూపును మెరుగుపరుస్తుంది.
- ఆలివ్ ఆయిల్‌లో విటమిన్స్, యాంటియాక్సిడెంట్స్ అధికంగా ఉంటాయి. కంటి చూపును ఆరోగ్యంగా ఉంచడంలో ఆలివ్ ఆయిల్ సహాయపడుతుంది.

## ఆశయం కోసం...

**ముంబైకి** చెందిన క్షీరజారాజే అనే 13 ఏళ్ల అమ్మాయి సంపాదించిన ప్రతీ పైసాని సామాజిక సేవకే వినియోగిస్తున్నారు. స్కూల్‌కి వెళ్తూనే హ్యాండీక్రాఫ్ట్ వ్యాపారం చేస్తూ వచ్చే లాభాన్నంతా సేవకే కేటాయిస్తున్నారు. అంత చిన్న వయసులో అలాంటి బలమైన ఆశయం కలిగి ఉండడం వెనక ఒక చిన్న సంఘటనే కారణం. ఇంటి భోజనం అంటే విసిగిపోయిన క్షీరజ ఒక రోజు.. అన్నం తిననని మారం చేసింది. అప్పుడు వాళ్లమ్మ ఆమెను ఒక పక్కనే ఉన్న మురికి వాడకు తీసుకెళ్లింది. అక్కడ దాతలు పెట్టే అన్నం కోసం వేచి చూస్తున్న చిన్నారులు కనిపించారు. అన్నం వ్యానురాగానే దాని వెనక పరిగెత్తడం చూసి



వాళ్లకు ఎలాగైనా సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకే స్కైలాంతర్లు, పేపర్ ఎన్వలప్‌లు, గ్రీటింగ్ కార్డులు, ఫోటో ఫ్రేమ్‌లు తయారు చేసి అమ్మేది. వాటితో వచ్చిన డబ్బును మురికి వాడల్లో ఉండే వాళ్లకోసం ఖర్చుపెట్టడం మొదలు పెట్టారు. ఇటీవలే వాళ్లమ్మకు కాన్సర్ వచ్చింది. మంచి ట్రీట్‌మెంట్ ఇవ్వడంతో వ్యాధి నయమవుతోంది. కానీ కాన్సర్ పేషెంట్‌లందరికి ఇలాంటి ట్రీట్‌మెంట్ దొరకదని తెలుసుకున్న క్షీరజా అలాంటి వాళ్లకు అండగా నిలవాలనుకున్నారు. అందుకే వాళ్లకోసం రూ.30 వేల ఫండ్ కలెక్ట్ చేశారు. దాంతో పాటు కాన్సర్ పేషెంట్ల కోసం ముంబైలోని టాటా మెమోరియల్ ఆసుపత్రిలో దీపావళి రోజు ఒక వర్క్‌షాప్ నిర్వహించనుంది. వాళ్లకు హ్యాండిక్రాఫ్ట్ తయారు చేయడంలో శిక్షణనివ్వనున్నారు.

